# విపశ్యన మాసపత్రిక

VOLUME : 5 NO. - 10 1 JAN, 2012

*(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగుమాస పత్రిక)*

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖేత్, వనస్థలిపురం, హైదరాబాదు - 70.


## "ధర్మవాణి"

**ఆనాపానస్సతి యస్సా, పరిపుణ్ణా సుభావిత ;**
**అనుపుబ్బమ్ పరిచితా, యథా బుద్ధేన దేసితా ;**
**సోమమ్ లోకమ్ పభాసేతి,**
**అబ్భా ముత్తోవ చన్దిమా**
**(మహాకప్పినత్థేరగాథ, ఖుద్దకనికాయె, థేరగాథాపాలి)**

**ఎవరైతే శ్వాస కదలికల ఎరుకలో పరిపూర్ణులవుతారో, బుద్ధుడు చెప్పిన విధంగా నిరంతరంగా అభ్యాసం చేస్తుంటారో అలాంటి వ్యక్తి మబ్బులు వీడిన చంద్రునిలా ప్రపంచాన్ని తేజోమయం చేస్తాడు.**

## అన్నగారికి వీడ్కోలు

మేము అయిదుగురు అన్నదమ్ములము. 92 సం॥ల వయస్సులో పరమ పదించిన శ్రీ బాలకృష్ణ గోయంకాగారు మా పెద్దన్నయ్య. మా నాన్నగారు, వారి పెద్దన్నయ్య శ్రీ రామేశ్వర గోయంకా గారికి సంతానం లేనందువలన, శ్రీ బాలకృష్ణ గోయంకాగారిని వారికి దత్తతుగా ఇచ్చినారు. మేమందరం మాండలేలో ఉంటుండేవారము. కానీ మాపెదనాన్న శ్రీ రామేశ్వర గోయంకా గారు, మాండలేకు 300 మైళ్ళ దూరంలో ఉన్న మచినాలో ఉండేవారు.

బాలకృష్ణను వారు ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకొనేవారు. సొంత తల్లితండ్రులనే మరిపించేటంత ఆప్యాయతను చూపేవారు. అతను మచినాలోనే చదువు కుంటుండేవాడు. అప్పుడప్పుడు మాండలే వస్తూ ఉండేవాడు. నాకు, మా రెండో అన్నయ్య బాబూలాల్‌కి బాలకృష్ణంటే ఎంతో ఇష్టం. వేసవి శెలవలలో మేము మచినా వెళ్ళేవారము. ముగ్గురమూ కలసి చక్కగా ఆడుకొనే వాళ్ళము.

వారి ఇంటికి కొద్దిదూరంలో ఉన్న మార్కెట్‌లో మా పెదనాన్నగారి కొట్టు ఉండేది. మా ఇద్దరిని బాలకృష్ణ తన సైకిలు మీద ఉదయం పూట మార్కెట్‌కి తీసుకు వెళ్ళేవాడు. తిరిగి సాయంత్రం తీసుకు వచ్చేవాడు. ప్రతిరోజు ఉదయానే 'ఇర్రవాది' నదికి తీసుకు వెళ్ళేవాడు. అందరం నదిలో స్నానం చేస్తూ ఆనందించే వాళ్ళము. అప్పటినుండి ఆ నదిపట్ల నాకు కలిగిన ప్రేమ ఇప్పటికీ అలాగే ఉంది.

నేను 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు మాండలేలోని ఖాల్సా స్కూలులో చదువుకున్నాను. చాలామంది నా స్నేహితులు సిక్కులు. వారిలో ఒకడు నన్ను ఫావు అని పిలవటం మొదలుపెట్టినాడు. ఫావు అనగా పెద్దన్నయ్య అని అర్థం. ఈ పదం నాకు బాగా నచ్చింది. మా పెద్దన్నయ్యను కూడా ఫావు అని పిలవటం మొదలు పెట్టినాను. మా అన్నయ్యకు కూడా బాగా నచ్చింది. నిష్ఠగా ఉండే హిందూ కుటుంబంలో పుట్టిపెరిగినప్పటికీ, మా సిక్కు స్నేహితులు పాడే భజనలు పాడుతూ ఉండేవాడిని. దగ్గరలోనే ఆర్యసమాజం వారి కార్యాలయం ఉండేది. అందువలన దాని ఉద్దేశ్యాలతో ప్రభావితం కాకుండా ఉండలేకపోయినాను. మచినాలో ఆర్యసమాజం వారిచే నిర్వహింపబడే స్కూలులో బాలకృష్ణ చదువుకున్నాడు. నేను ఆర్యసమాజం పట్ల మొగ్గు చూపేటప్పుడు చాలా సంతోషించేవాడు.

అలా మేము పెరిగి పెద్దవారమై పెళ్ళిళ్ళు చేసుకుని వ్యాపారం మొదలు పెట్టినాము. బర్మాపై జపాన్ యుద్ధం చేసినప్పుడు మేము సర్వం కోల్పోయాము. తిరిగి భారతదేశానికి వచ్చాము. మేము ముగ్గురం కలిసి వ్యాపారం ప్రారంభించాము. చెప్పుకోతగినంత వృద్ధిని సాధించాము. జపాన్ ఓడిపోయి తిరిగి బర్మా బ్రిటీషు పరిపాలనలోకి వచ్చిన తరువాత నేను, బాబూలాల్ తిరిగి బర్మా వెళ్ళినాము. బాలకృష్ణ తన కుటుంబంతో సహా ఇండియాలోనే ఉండిపోయినాడు. మేము దూరంగా ఉన్నప్పటికి మామధ్య ఆర్థిక సంబంధాలు, కుటుంబ సంబంధాలు చాలా బాగుండేవి.

నేను విపశ్యన విద్యను బర్మాలో నేర్చుకున్నాను. దానివలన నాకు చాలా మేలు కలిగినది. ఈ విషయం తెలుసుకుని బాలకృష్ణ చాలా సంతోషించాడు. అతను కూడా బర్మా వచ్చి పూజ్యులైన మా గురువుగారు శ్రీ సయాజీ ఉబాఖిన్ గారి వద్ద ఒక కోర్సు చేసినాడు. దురదృష్టవశాత్తు అతను విపశ్యన అభ్యాసాన్ని కొనసాగించలేకపోయినాడు. వేరే ధ్యాన పద్ధతిని అనుసరించాడు.

బుద్ధవాణిని, విపశ్యన అభ్యాసాన్ని తిరిగి పునరుద్ధరించటానికి 1969లో నేను భారతదేశం వచ్చాను. బాలకృష్ణ, అతని కుటుంబ సభ్యులు అతను అనుసరించే వేరే ధ్యాన పద్ధతిలో మునిగిపోయి ఉన్నారు. అందువలన నా లక్ష్యసాధనలో అతను చురుకుగా పాల్గొనలేకపోయినాడు. అయినప్పటికీ ముంబయిలో మొదటి శిబిరం పూర్తైన వెంటనే రెండో శిబిరాన్ని, నాపై ఉన్న అభిమానం కొద్ది బాలకృష్ణ చెన్నైలో ఏర్పాటు చేసినాడు. ఈ కోర్సుకు కావలసిన అన్ని ఏర్పాట్లు తనే చేశాడు. తన భార్యను కోర్సులో కూర్చోమన్నాడు. తనకి నచ్చిన ధ్యానపద్ధతిలో అతను నిండా మునిగి ఉండి కూడా నాకు సహాయపడటం చూసి నేను చాలా ఆశ్చర్యపోయినాను. నాపట్ల అతనికి ఎంతో ప్రేమ ఉన్నదని తెలుసుకోగలిగాను. అతను కోర్సులో కూర్చోనప్పటికి విపశ్యనను భారతదేశంలో వ్యాపింపచేద్దామనే నా లక్ష్యసాధనలో నాకు చాలా సహాయం చేసాడు. అతని సహాయకుల్లో ఒకరిని నాకు సహాయపడమని చెప్పాడు. అతను అప్పటినుండి నాతోనే ఉన్నాడు.

కాలం గడిచిపోతుంది. భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా విపశ్యన తెలియవస్తుంది. కనీసం ఒక కోర్సులోనైనా బాలకృష్ణ కూర్చొంటే బాగుండు అనుకొనే వాడిని. కానీ అతను ఎంతో సంకోచించేవాడు. చివరికి నా సంతోషం కొరకు అతను ఒక కోర్సులో చేరాడు. దాని తరువాత జీవితాంతం అతను విపశ్యనను అభ్యాసం చేసాడు. తన అభ్యాసంలో ఎంతో పురోగతిని సాధించాడు. ప్రకృతి నియమాలపై ఆధారపడి పనిచేసే, దాని విధి విధానాలను ఆసాంతం ఆకళింపు చేసుకున్నాడు. అందువలన అతను విపశ్యన టీచర్‌గా నియమితుడవటమే కాకుండా దక్షిణ భారతదేశంలోని నాలుగు రాష్ట్రాలలో జరిగే విపశ్యన కార్యకలాపాలను పర్యవేక్షించే బాధ్యతను చేపట్టాడు. తన

కుటుంబ మరియు వ్యాపార బాధ్యతలు అనేకం ఉన్నప్పటికి, వాటితోపాటు విపశ్యన వ్యాప్తికై తన కప్పగించిన బాధ్యతను పూర్తిగా నిర్వహించాడు. ప్రస్తుతం ఈ బాధ్యతను నిర్వహించే వ్యక్తికి బాలకృష్ణ నిర్వహించిన తీరు నిరంతర స్ఫూర్తిదాయకంగా ఉంటుంది.

అతనికి ఉన్న దానగుణము సాటిలేనిది. ప్రతి ఉదయం చెన్నైలోని మెరైన్ డ్రైవ్ బీచ్‌లో పేదవారికి అన్నదానం చేస్తూ ఉండేవాడు. నేను చెన్నైలో ఉన్నప్పుడు ఈ దృశ్యాన్ని చూసేవాడిని. అతను చూపించే ఆప్యాయత వలన చాలామంది పేద పిల్లలు, పెద్దలు అతనిచ్చే ఆహారాన్ని స్వీకరించటానికి ఎంతో క్రమశిక్షణతో బారులు తీరి కూర్చొనేవారు. ఏమాత్రం గోల ఉండేది కాదు. మా అన్నగారు పేదవారికి అన్నాన్ని దానం చేయటం చూసి నేను చాలా సంతోషించేవాడిని. చెన్నైలో అతను అగర్వాల్ భవన్‌ను నిర్మించాడు. అది ఇప్పటికీ ప్రజలకు ధర్మసత్రంగా ఉపయోగపడుతుంది. అతని తండ్రిగారి జ్ఞాపకార్థం చురులో ఒక పాఠశాలను నిర్మించాడు.

అతనిలోని దాతృత్వగుణం వలన మా పెద్దన్నయ్య గారు తన వ్యాపారంలో కూడా ఎంతో సఫలీకృతులు కావటం చూసి నేను చాలా సంతోషించేవాడిని.

అప్పుడు నాకు ఈక్రింది పద్యం గుర్తుకు వచ్చేది.

వసంత ఋతువు బికారి అయినది<br>
చెట్లన్నీ తమ ఆకులను కోల్పోయినవి.<br>
ఫలితంగా చెట్లు క్రొత్త చిగుళ్ళు తొడిగినవి,<br>
ఇచ్చినదేది వృథాపోదుగదా.

(సామెత : పెట్టినమ్మకి పుట్టిందే సాక్షి. అనువాదకుడు)

అతనిలోని దాతృత్వగుణం వలన మా అన్నగారి కుటుంబము వ్యాపారంలో బాగా వృద్ధి చెందినది. అదేవిధంగా విపశ్యన విద్యలో కూడా నిరంతర అభ్యాసం ద్వారా మంచి పురోగతిని సాధించాడు. ఎన్నో అకుశల సంస్కారాల నుండి విముక్తి పొందినప్పటికి అతని నిష్క్రమణానికి ముందు ఎదో ఒక బలీయమైన సంస్కారము ఉదయించింది. దానివలన అతను బాధపడ్డాడు. అతను కోమాస్థితిలో ఉండికూడా నానుండి మైత్రిని అందుకుం టుండేవాడు. ఇది చాలా మంచి పరిణామము. అతను చనిపోయేటప్పుడు చాలా ప్రశాంతంగా ఉన్నాడని నా కుమారుడు శ్రీ ప్రకాష్ ద్వారా విన్నాను. అతను తప్పకుండా తుసితలోకంలో జన్మించి ఉంటాడు.

అతని తమ్ముళ్ళ పట్ల అతనికి ఉన్న అపారమైన ప్రేమను చూసి స్ఫూర్తిని పొందుదాము. అతని ఆదర్శవంతమైన ధర్మజీవనం నుండి ప్రేరణ పొందుదాము.

భవతు సబ్బమంగళం !

ధర్మపథంలోని బాటసారి<br>
శ్రీ ఎస్.ఎన్.గోయంకా

## అమరత్వమే నిర్వాణం యొక్క సత్యం

(క్రింది వ్యాసము విపశ్యన ప్రచార సమితి, హైదరాబాదు వారు ప్రచురించిన "పవిత్ర ప్రేరణ మేల్కొనుగాక" అను గ్రంథము నుండి స్వీకరించబడినది.)

మామూలుగా అందరి జీవితాల్లోనూ చిన్నా, పెద్ద సంఘటనలు జరుగుతూనే ఉంటాయి. చాలా సాధారణమైన సంఘటన కూడా ఒక్కొక్కప్పుడు పుణ్యవంతులకు (పుణ్యపురుషులకు) అపూర్వ ప్రేరణాదాయకమవుతుంది. వారి అంతరంగంలో అణచశక్యం కాని ఉత్సాహం పెల్లుబికేట్లు చేస్తుంది. దాంతో వారు అన్ని సుఖసౌఖ్యాలను తృణప్రాయంగా త్యజించి, ముక్తిమార్గంలో దృఢనిశ్చయంతో సాగిపోతారు.

ముసలివాడిని, రోగగ్రస్తుడిని, మరణించినవాణ్ణి, శ్రమణ సన్యాసులను చూడటం అసాధారణమైన విషయమేమీ కాదు. చాలా సాధారణమైన విషయమే. ఇలాంటివి ప్రజలు ఎప్పుడూ చూస్తూనే ఉంటారు. తన కుమారుడు సిద్ధార్థుణ్ణి నివృత్తి మార్గంవైపు వెళ్ళకుండా ఆపడంకోసం, శుద్ధోదన మహారాజు మైమరపించే భోగవిలాసాలను, నాట్యవినోదాలను ఎన్నింటినో ఏర్పాటు చేసి ఉండవచ్చు. ఒక శవాన్ని చూసే అవకాశం అంతకుముందెప్పుడూ ఆయనకు కలిగి ఉండకపోవచ్చునేమోగాని ముసలివాళ్ళనైతే తప్పక చూసే ఉంటాడు. బాగా ముసలివాళ్ళైన పరిచారికలు, నౌకర్లు సిద్ధార్థుని కంటపడకుండా మహారాజు జాగ్రత్తలు తీసుకొని ఉండవచ్చు. కాని సుమారు 29 ఏళ్లప్రాయంలో ఇల్లు వదిలే సమయానికి, పెంచిన పినతల్లి ప్రజాపతి గౌతమి, తండ్రి శుద్ధోదనుడు ఇద్దరూ దాదాపు 70 ఏళ్లు పైబడిన ముసలివాళ్ళే. తెల్లబడిన వాళ్ళ జుట్టు, ముడతలు పడిన ముఖము సిద్ధార్థుడు తప్పకుండా చూసే ఉంటాడు. అలాగే వాళ్ళల్లో ఎవరో ఒకరు ఎప్పుడో ఒకప్పుడు రోగగ్రస్తులై ఉండటం కూడా చూసే ఉంటాడు. ధర్మభీతి గల రాజకుటుంబం గనుక, ప్రతిరోజూ సాధువులకు, సన్యాసులకు అన్నదానము, గౌరవ సత్కారాలు చేస్తూ ఉండవచ్చు కూడా. వారికి నమస్కరించడానికి, వారి ఆశీస్సులు పొందడానికి రాకుమారుణ్ణి వారి సమ్ముఖానికి తోడ్కొని పోవడం కూడా తరచూ జరిగే ఉండవచ్చు. కాబట్టి, ఇలాంటి దృశ్యాలను ఆయన అంతకు ముందు కూడా తప్పక చూసే ఉంటాడని అనుకోవడం సమంజసమే. కాని, ఆరోజు వరుసగా అవే నిమిత్తాలు (కారణాలు) కనిపించినప్పటి ఆయన మనఃస్థితి ఎలాంటిదంటే అది ఆయనలో ఆపుకోలేని గట్టిప్రేరణను మేల్కొల్పి సత్యాన్వేషణ కోసం గృహత్యాగం చేయటానికి కారణమైంది.

ఆరోజు ఆయన చూసిన జరావ్యాధిమృత్యు దృశ్యాల్లో ప్రపంచంలోని దుఃఖం ఆయన్ను కలచివేసి ఉండవచ్చు. అలాగే గృహత్యాగి అయిన సన్యాసిని చూసినప్పుడు దుఃఖవిముక్తికి మార్గం ఉండే ఉంటుందన్న నమ్మకం కూడా ఆయనలో కలిగి ఉండవచ్చు. ఈ కారణంగానే ఆ సమయంలో తటస్థించిన ఆ సంఘటనలు ఆలోచనాశీలి అయిన రాకుమారుని అంతరంగంలో ఆలోచనల పెనుతుఫాను రేపి ఉండవచ్చు.

"సంసారంలో (జగత్తులో) పుట్టుక, రోగము, ముసలితనము వలన కలిగే దుఃఖం ఎక్కడ అయితే ఉందో, అక్కడే వాటికి ఆవల అజరామరమైన నిర్వాణసత్యం కూడా తప్పక ఉండే ఉంటుంది. దాన్ని నేను కనుగొనాలి!"

"ఏవిధంగానైతే ఈ సంసారంలో ఒకవైపు ఇంద్రియ సంబంధమైన దుఃఖం వ్యాపించి ఉందో, అదేవిధంగా మరోవైపు ఇంద్రియసుఖం కూడా ఉంది; ఏవిధంగా జననమరణాల భవచక్రం ఉందో, అదేవిధంగా జన్మరాహిత్య భవవినాశ స్థితి కూడా ఉండే ఉంటుంది; ఎక్కడైతే పాపం ఉందో, దానికి వ్యతిరేకంగా ఈ లోకంలో పుణ్యమూ ఉంది; అదేవిధంగా ఎక్కడ జన్మ ఉందో, అక్కడ జన్మించని స్థితి (జన్మరాహిత్యం) కూడా ఉండి తీరాల్సిందే, ఎక్కడ జరావస్థ ఉందో, అక్కడ జరారాహిత్యస్థితి కూడా ఉండే ఉంటుంది; ఎక్కడ మృత్యువు ఉందో, అక్కడ తప్పక అమృతత్వం (మృత్యురాహిత్యం) ఉండే ఉంటుంది. దాన్ని నేను అన్వేషించాల్సి ఉంది; కనుగొనాల్సి ఉంది."

"దుఃఖదాయకమైన జన్మ, వ్యాధి, జరామృత్యువుల భవచక్రానికి కారణభూతమైన మూల కారణం అంటూ ఏదో ఒకటి ఉండి ఉండాలి; దాని నివారణ కోసం ఏదో ఒక ఉపాయం కూడా తప్పక ఉండి ఉండాలి; అలాంటి ఉపాయమే గనుక ఉంటే, దాని ద్వారా భవభ్రమణం నుండి పూర్తిగా విముక్తి పొంది నితాంత దుఃఖ నిరోధావస్థ యొక్క పరమసత్యాన్ని పొందవచ్చు. తప్పక పొంది తీరాల్సిందే. కేవలం నా ఒక్కడి దుఃఖనిరోధం కోసం మాత్రమే కాదు. ప్రపంచంలో ఇంతమంది దుఃఖాలతో పరితపిస్తున్నారు. దారీతెన్నూ తెలియక కొట్టుమిట్టాడుతున్నారు. వారందరి దుఃఖవిముక్తి కోసం కూడా పరమసత్యాన్ని కనుక్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది."

'బాగా మురికి అంటిన వ్యక్తికి, తన మురికిని కడుక్కోడానికి ఒక నీటి కొలను ఉంది. ఆ నీటికొలనును వెదికి కనుక్కోకపోతే, ఆ తప్పెవరిది? కొలనుది కాదు కదా!'

'ప్రాణాంతకులైన శత్రువులు చుట్టుముట్టిన వ్యక్తి తప్పించుకు పారిపోవటానికి వీలైనదారి ఉంది. కాని ఆ వ్యక్తి ఆ దారిని వెతుక్కోకపోతే, తప్పు ఎవరిది? ఆ దారిది కాదుకదా!"

"ఇంట్లో మంటలమధ్య చిక్కిన వ్యక్తికి, తప్పించుకోడానికి తలుపు తెరుచుకునే వీలుంది. కానీ ఆ వ్యక్తి అందుకు ప్రయత్నం చేయకపోతే, ఆ తప్పు ఎవరిది? తలుపుది కాదు కదా!"

"రోగాన్ని తొలగించే చికిత్సైతే ఉందిగానీ, రోగి దాన్ని పొందే ప్రయత్నమే చేయకుంటే ఆ దోషం ఎవరిది? చికిత్సది కాదు కదా!"

"భవచక్ర ప్రభావం వల్ల జన్మజన్మాంతరాల్లో క్లేశం అనుభవించే వ్యక్తికి క్లేశ-నివారణా మార్గమైతే ఉంది. కాని అతడు ఆ మార్గాన్ని అన్వేషించకపోతే ఆ దోషమెవరిది? మార్గానిది కాదుకదా!"

"అయితే ఈ అన్వేషణ ఇంట్లో ఉండి చేయడం కుదరదు. గృహస్థ జీవితంలో ధర్మం పేరిట ఎక్కువగా కర్మకాండలు చేయడమే జరుగుతుంది. వాటిలో పరమ సత్యాన్ని వెదకడమంటే, సారంలేని దాంట్లో సారం వెదకడమే! శుద్ధోదనుడు ధర్మశాస్త్రాల్లో పండితులైన ఆచార్యులను పిలిపించి, అన్ని దార్శనిక మాన్యతల పరిజ్ఞానం సిద్ధార్థుడు పొందేలా చేశాడు. కానీ కేవలం చింతన-మననాలతో, బుద్ధివిలాసంతో పరమసత్యాన్ని అందుకోవడం అసంభవం. ముక్తి పొందిన మునుపటి మహాపురుషులు సత్యం యొక్క సాక్షాత్కారం స్వయంగా చేసుకున్నారు; తమ లోపలే చేసుకున్నారు. నేను కూడా ఇదే చేయాలి. పరమసత్యాన్ని నా లోపలే అన్వేషించి సాక్షాత్కరింప చేసుకోవాలి. దీనికోసం అంతరంగపు లోలోతుల్లోకి ప్రవేశింప చేయగలిగే శాస్త్రసమ్మతమైన సాధనా మార్గాన్ని కనుగొనవలసి ఉంది. నిరంతరంగా, నిరాటంకంగా దాని అభ్యాసం చేయడానికి అనుకూలమైన వాతావరణం కావాలి. బంధాలతో, బాహ్యాడంబరాలతో కూడిన ఈ రాచరికపు వాతావరణంలో దాన్ని పొందడం అసంభవం."

పరమసత్యాన్ని వెదకాలన్న తీవ్రమైన కోరికకు, సామాన్యమైనవిగా అనిపించే ఈ నాలుగు నిమిత్తాలు (సంఘటనలు) ఎనలేని ఊపందించాయి. ఆయనలో అపరిమితమైన ప్రేరణ కలిగేలా చేశాయి. అపురూపు లావణ్యము, సేవాతత్పరత కలిగిన భార్య యశోధరను, లేతగులాబీ మొగ్గవంటి పసిబాలుడు రాహులుణ్ణి, అనేక ఇతర ఆకర్షణలను త్యజించి, సత్యశోధకుడైన రాకుమారుడు గృహత్యాగియైనాడు. రాచరికపు వైభవ విలాసాలను, సుఖాలను, భావి చక్రవర్తిత్వాన్ని నిస్సంగభావంతో వదిలివేశాడు. వదిలిన తర్వాత మళ్ళీ వెనుదిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

ముముక్షువై ఇలా పరమసత్యాన్ని వెదకడానికి బయలుదేరిన రాకుమారుడు అనేక చోట్ల తిరిగాడు. పలురకాల ప్రయోగాలు చేసి చూశాడు. ఆ రోజుల్లోని సుప్రసిద్ధ ధ్యానాచార్యులైన ఆలారకలాముని వద్ద ఏడు ధ్యానాలు, ఉద్దకరామపుత్రుని వద్ద ఎనిమిదవ ధ్యానము నేర్చుకున్నాడు. వారిరువురు అత్యంత లోతైన సమాధి (ఏకాగ్రత) అభ్యాసాల్లో దిట్టలు. వారివద్ద నేర్చుకొని, ప్రావీణ్యత సంపాదించి, ఆ ధ్యాన సమాధుల అభ్యాసం ద్వారా సిద్ధార్థుడు అంతరంగపు అట్టడుగు లోతులను చూడగలిగాడు. కాని వీటివల్ల కూడా ఇంద్రియాతీతమైన పరమసత్యం యొక్క సాక్షాత్కారం కాలేదని గ్రహించాడు. అవి ఆరోజుల్లో ప్రసిద్ధిచెందిన అతి ఉన్నతమైన, ఉత్కృష్టమైన ధ్యానస్థితులు. మొదటి నాలుగు ధ్యానాల్లో తన లోపల (అంతరంగంలో), తర్వాతి మూడు ధ్యానాల్లో చిత్తమును (మనసును) బయట అనంతం వరకు వ్యాపింపచేయడం నేర్పించబడతాయి. ఈ ధ్యానాలకు పలు ఆలంబనలుంటాయి. మట్టి (భూమి), జలము, అగ్ని, వాయువులే గాక రకరకాల రంగులు, కాంతులనుగూడా ఆలంబనగా చేసుకోవడం జరుగుతుంది. సుదీర్ఘ అభ్యాసం ద్వారా ఈ ఆలంబనలను చిన్నవిగా చేస్తూ-చేస్తూ, మూసిన కళ్ళముందు లేశమాత్రమైన బిందువుగా చిన్నదిగా చేసి, దానిపైన స్థిరంగా ధ్యానాన్ని నిలపడం జరుగుతుంది. ఆపై ప్రబలమైన మనోబలంతో ఆ ఆలంబనమీద పూర్తి పట్టు సాధించడానికి ఎన్నో ప్రయోగాలు చేయబడతాయి. ఆ తరువాత సాధకుడు ఆ ఆలంబనను యధేచ్ఛగా విస్తృతపరుస్తాడు. వ్యాపింపజేస్తాడు. అనంతం వరకు వ్యాపింపజేస్తాడు. లేశమాత్రపు రంగుచుక్కను సాధనలో ముందుకెళ్ళేకొలది ప్రకాశవంతమైన బిందువుగా అనంతం వరకు వ్యాపింపజేసి, తన చిత్తాన్ని అందులో సమాహితం చేస్తాడు. తెల్లని బిందువు నుండి అనంత ఆయతనాల ఈ ఐదు నుండి ఎనిమిది ధ్యాన సమాపత్తుల ద్వారా సాధకుని మనసు ఎన్నో పాళ్లలో నిర్మలమౌతుంది. కానీ అంతర్మనసు అట్టడుగు లోలోతుల్లోని అనేక జన్మల సంచిత కర్మసంస్కారాల క్లేశ కషాయాలకు చెందిన కొన్ని కూకటివేర్లు మిగిలి ఉండిపోతాయి. వాటిని కూడా తొలగించుకోనంతవరకు పూర్ణముక్తి సాధ్యం కాదు. ఎనిమిది ధ్యానాలను పరిపూర్తి చేసిన సాధకుడు భవాగ్రస్థితియైన అరూప బ్రహ్మలోకాలను చేరగలిగే అర్హతను ఖచ్చితంగా పొందుతాడు. కాని భవాతీతమైన నిర్వాణస్థితిని పొందలేడు. లోకాతీతమైన పరమవిముక్తిని పొందలేడు. ఇలాంటి సాధకుడు అతీంద్రియ అనుభూతులను ప్రాప్తింపజేసుకొని, అలౌకికమనిపించే అనేక రకాల అద్భుత బుద్ధి-సిద్ధులకు యజమాని తప్పక కాగలడేకాని ఇంద్రియాతీతమైన, నిత్యము, ధృవము, శాశ్వతము ఐన పరమశాంతిని పొందలేడు. ఎప్పటివరకు లేశమాత్రంగానైనా కర్మసంస్కారాల క్లేశం మిగిలిఉంటుందో, అప్పటివరకు భవచక్రం, లోకచక్రం, దుఃఖచక్రం నడుస్తూనే ఉంటాయి. విముక్తి యొక్క పరమసత్యాన్ని అన్వేషించేవాడెవరైనా ఇలాంటి చలివేంద్రాలలో ఎలా ఆగిపోతాడు? లేశమాత్రంగా మిగిలిన అనుశయ క్లేశాలను తొలగించుకునేందుకు ఆ ధ్యానాచార్యుల వద్ద ఎలాంటి సాధనమూ లేదు. కాబట్టి సిద్ధార్థ గౌతముడు ఇతర సాధనల అన్వేషణలో ముందుకు సాగాడు.

శరీరాన్ని భిన్నభిన్న రీతుల్లో శుష్కింపజేస్తూ, కష్టపెడుతూ, నియంత్రిస్తూ పోతే కర్మల యొక్క మాలిన్యం తొలగిపోతుందనే నమ్మకం ఆరోజుల్లో బహుళ ప్రాచుర్యం పొందింది. దీన్ని కూడా ఎందుకు చేసి చూడకూడదు అని గౌతముడు భావించాడు. వైభవవిలాసాల్లో పుట్టి పెరిగిన సుకుమార కోమల రాజయోగి దృఢ నిశ్చయంతో ఈ దుష్కర తపశ్చర్యల్లో మునిగిపోయాడు. దీన్ని కూడా అంతిమ హద్దు వరకు ప్రయోగించి చూశాడు. ఆరోజుల్లో ప్రాచుర్యంగల దేహపీడనలతో కూడిన అన్ని తపస్సులూ చేసిచూశాడు. పలువిధాలుగా తపింపజేస్తూ, శుష్కింపజేస్తూ శరీరాన్ని ఎంతో యాతనకు గురిచేసి చూశాడు.

దేహాన్ని చీల్చివేసే ముళ్లమంచం మీద చాలారోజులు పడుకునే వాడు. వణుకు పుట్టించే చలిలో తడిబట్టలతో పడుకునేవాడు. మంచు కురిసే చలికాలంలో రాత్రంతా ఆరుబయట మైదానంలో గడిపి, పగలు తేమనిండిన దట్టమైన వనప్రదేశాల్లో ఉండేవాడు. రోళ్ళు పగిలే రోహిణీకార్తె ఎండల్లో ఏ నీడా లేని మైదానంలో ఉంటూ, రాత్రిళ్ళు వేడెక్కిన బండరాతిపై పడుకొని దేహాన్ని పలురకాలుగా యాతనకు గురిచేసేవాడు. తినగూడని నానారకాల తిండ్లు తిని చూశాడు. ఆ తరువాత ఉపవాసంతో దేహాన్ని ఎండుచేపలా

ఎండించి, ఎముకల పోగుగా మిగిలాడు. ఒంట్లో మాంసమనేది నామమాత్రంగా కూడా మిగల్లేదు. కేవలం ఎముకల గూటిపై కప్పబడిన ఎండిన చర్మం మాత్రమే మిగిలింది. మూడు పదుల యుక్తవయసులో ఎనభైఏళ్ళ ముదుసలి కన్నా హీనంగా తయారయ్యాడు. బంగారుకాంతులీనే శరీరం నల్లగా మాడిపోయింది. శరీరం నిండా మురికి అట్టలు కట్టుకుపోయింది. తుంటి ఎముకలు ఒంటెకాళ్లలా తయారయ్యాయి. త్రాటికి గూర్చిన ఉమ్మెత్తకాయలవలె వెన్నెముక కనబడ సాగింది. శిథిలగృహపు వెన్నుగాడి వాసాలవలె ఛాతీ ఎముకలు ఉన్నాయి. కొండవీటి బావి నీటివలె లోలోతుల్లో ఎక్కడో మిణుకుమిణుకుమనే నక్షత్రాల నీడల్లా కళ్ళుపీక్కుపోయి, కొడిగట్టిన దీపాల్లా వెలవెలబోతున్నాయి. వెంట్రుకలన్నీ ఊడిపోయి నెత్తిమీది చర్మం తుంబుర టెంకవలె మారిపోయింది. పొట్టచర్మం వీపు ఎముకలను తాకింది. పొట్టను తడిమితే చేతికి వెన్నముక తగిలేది. శరీరం ఎంత దుర్బలమైపోయిందంటే, ఏ భాగాన్ని కూడా చేతి ఆసరా లేకుండా కదిలించలేకపోయేవాడు. శరీరంలోని వెంట్రుకలన్నీ కుప్పలు కుప్పలుగా ఊడిపోయాయి. మలమూత్ర విసర్జనకు వెళ్ళవలసి వచ్చినా కూడా అడుగువేయలేక పడుతూ-లేస్తూ-పాకుతూ వెళ్ళేవాడు. కళ్ళు తిరిగి పడిపోయే వాడు. ఇది కాయక్లేశము యొక్క కఠిన తపశ్చర్యల్లో చరమస్థితి.

దాదాపు ఆరేళ్లు దుష్కర తపశ్చర్యల తరువాత ఎనిమిది ధ్యానాలు చేసినప్పుడు మిగిలిపోయిన లేశమాత్రపు అనుశయక్లేశాలు ఇంకా ఎక్కడివక్కడే ఉన్నాయని చూశాడు. అవి కొంచెం కూడా తొలగిపోలేదు.

అప్పుడిక బాగా తెలిసివచ్చింది. "కామభోగాల్లో, విలాస వైభవాల్లో మునిగితేలే వ్యక్తి, లాలసల (కోరికల) అతివైపుకు మొగ్గి ఏవిధంగా ముక్తికి దూరమౌతాడో, అదేవిధంగా దేహాన్ని విపరీతంగా కష్టపెట్టుకుని ఘోరతపస్సుల పేరుతో రెండో అతివైపు మొగ్గినవాడు కూడా ముక్తికి దూరమౌతాడు" అనే విషయం బాగా అర్థమయింది. సంస్కరించుకోవలసింది మనసును. మనసును బాగుపరచాలి. వికారాల నుండి దాన్ని విముక్తం చేయాలి. దీనికోసం సాధనలో మధ్యమ మార్గాన్ని వెదకవలసి ఉంది.

తగిన ఆహారం తీసుకుంటూ శరీరాన్ని ఉత్తమ సాధన చేయుటకు యోగ్యమైందిగా తయారు చేసుకొని స్వయంగా తన లోలోపలే మధ్యమ మార్గాన్ని వెదకటం మొదలుపెట్టాడు. ఈ వెదుకులాటలో అనేక ఆంతరంగిక అడ్డంకులను ఎదుర్కోవలసి వచ్చింది. వాటన్నింటినీ తగురీతిలో అధిగమిస్తూ మరింత లోలోతులకు వెళ్ళాడు. చివరకు తాను అనేక జన్మల్లో పెంపొందించు కొని ప్రోగుచేసుకొన్న పుణ్యపారమితల అపరిమితమైన బలం మేల్కొంది. ముక్తిప్రదాయినియైన విపశ్యన మార్గం దేదీప్యమానమై వెలుగొందింది.

కామభోగాల బంధనం స్పష్టమయింది. దేహదండనల, తపస్సుల నిస్సారత్వం స్పష్టమయింది. కర్మకాండల నిష్ప్రయోజకత్వం తేటతెల్లమైంది. విభిన్న దార్శనిక మాన్యతల చిక్కుముడులు వీడిపోయాయి. స్వానుభూతి (స్వంత అనుభవం) ఆధారంగా మేల్కొనిన భావనామయ ప్రజ్ఞాబలంతో అంధవిశ్వాసాలన్నీ నశించి, దర్శనం, సమ్యక్ దర్శనం అయింది. మేధోపరమైన చింతన మననాలతో కూడిన మిథ్యాజ్ఞానం, సమ్యక్ దర్శనం యొక్క ఆధారంతో ప్రత్యక్షానుభూతి గల సమ్యక్ జ్ఞానం అయింది. ఊహాత్మకమైన విముక్తి, సమ్యక్ విముక్తి అయింది. పరమకల్యాణకరమైన సమ్యక్ సంబోధి ఉపలబ్ధమైంది. అనుశయక్లేశాలన్నీ ఛిన్నాభిన్నమైనాయి. చిత్తం మొత్తము వికారాలనుండి నితాంతంగా విముక్తమయింది. చిత్తవిముక్తి సంబోధికి దారితీసింది. నిత్యము, శాశ్వతము, ధృవము అయిన పరమసత్యం సాక్షాత్కారమైంది.

సిద్ధార్థుడు సమ్యక్ సంబోధి పొంది సమ్యక్ సంబుద్ధుడయ్యాడు; సర్వదా జాగృతుడయ్యాడు; ప్రబుద్ధుడయ్యాడు; సర్వజ్ఞుడయ్యాడు.

సామాన్యము, సాధారణము అనిపించే ఆ నాలుగు ప్రతీకలు (సంఘటనా దృశ్యాలు) ఏవిధంగా అనంతమైన ప్రేరణను కలిగించాయో చూడండి! సాధకుని మనసులో సత్యాన్వేషణ ఉప్పెనలా పెల్లుబికి అనంత శాంతి యొక్క పరమావస్థకు చేర్చేవరకు ఆగలేదు. సాధకుడు ధన్యుడైనాడు. అలాంటి సాధకుని పొంది సాధనే స్వయంగా ధన్యమైంది. అలాంటి సాధకుడు కేవలం తన స్వస్తి-ముక్తి కోసమే కాకుండా, లక్షలాది కోట్లాది ప్రాణుల స్వస్తి-ముక్తి ప్రేరణకు సేతువయ్యాడు. తుఫానులో దిక్కుతోచని వారికి ప్రకాశవంతమైన దీపస్తంభమయ్యాడు.

మనలో కూడా ఇలాంటి మంగళదాయకమైన ప్రేరణ మేల్కొనుగాక! అపరిమిత శుభఫలాలనిచ్చునుగాక!


**సంవత్సర చందా రూ.50/-, 5 సంవత్సరముల చందా రూ.200/- ఈ క్రింది చిరునామాకు పంపి పత్రికను పొందగలరు.**

**విపశ్యన తెలుగు మాసపత్రిక,**

**విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు - 500 070. ఫోన్ : 24240290 (ఆశ్రమం)**

***(ఆఫీసు పనిచేయు వేళలు : ఉదయం 9 గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు)***

Postal Reg. HSE 864/2007-2009 RNI Reg. No. APTEL/2006/17745


**PRINTED MATTER**


If Undelivered please return to :
**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org



**Published for Vipassana International Meditation Centre, 12/6 KM, Nagarjuna Sagar Raod, Sahebnagar, Vanasthalipuram, Hyd. (A.P.)-70. Ph : 040-24240290. Published by Smt. Sabrina Katakam.**
**Editor : Sri O. Premanand, Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 23325979.**